**విలేకరులు కావలెను**

తెలంగాణ వ్యాప్తంగా వెలువడుతున్న నేటి తెలంగాణ దినపత్రికలో రిపోర్టర్‌గా పని చేయుటకు మండలాల, జిల్లాల, నియోజకవర్గ స్థాయిల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ :

9700012348

సమస్యలపై సమరం... పరిష్కారమే ధ్యేయం...

# నేటి తెలంగాణ

తెలుగు దిన పత్రిక

EYE tv
విలువైన మాటలు.. అరుదైన దృశ్యాలు..
@eyetvtelugu
/eyetvtelugu

14-01-2025 మంగళవారం సంపుటి : 2 సంచిక : 325 పేజీలు 4 వెల : 3 CIRCULATED FROM : HYDERABAD, WARANGAL, KHAMMAM, KARIMNAGAR, RANGAREDDY, NIZAMABAD - https://epaper.netitelanganadaily.com



# తెలుగు లోగిళ్లలో భోగి వేడుకలు

అంబరాన్నంటిన పొంగల్ సంబురాలు.. వీధుల్లో భోగి మంటలు, రంగవల్లులు

మంటల చుట్టూ డ్యాన్స్ చేస్తూ సందడి.. ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

గ్రామాల్లో హరిదాసుల సంకీర్తనలు.. గాలిపటాలు ఎగురవేస్తూ యువత కేరింతలు

వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు.. నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు

ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన రేవంత్

2 లో



## పదేళ్ల ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగించాలి

అప్పుడే సంక్రాంతికి వన్నె తెచ్చినవారమవుతాం

రూ.4.5లక్షల కోట్లు వ్యవసాయ రంగానికి ఖర్చు చేశాం

సంక్రాంతి రైతులకు ప్రత్యేకమైన పండుగ

బీఆర్ఎస్ హయాంలో పండుగలా వ్యవసాయం

బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్



హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 4. 5లక్షల కోట్లను వ్యవసాయరంగ అభివృద్ధికి ఖర్చు చేసిందని మాజీ సీఎం కేసీఆర్ తెలిపారు. రాజకీయాలకతీతంగా, రైతు సంక్షేమమే ధ్యేయంగా పదేళ్ల ప్రగతి ప్రస్థానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని సూచించారు. తద్వారా రైతు పండుగ సంక్రాంతి వేడులకు వన్నె చేకూర్చినవారమవుతామని తెలిపారు. ఈ మేరకు సోమవారం గులాబీ బాస్ ఓ ప్రకటన విడుదల చేశారు.

**బీఆర్ఎస్ హయాంలో పండుగలా వ్యవసాయం..**

రాష్ట్ర ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి రైతులకు, వ్యవసాయానికి ప్రత్యేకమైన పండుగ అని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో వ్యవసాయం పండుగ శోభ సంతరించుకుందన్నారు. రైతన్నల జీవితాల్లో వెలుగులు కొనసాగాలంటూ ప్రకృతి మాతను ప్రార్థించారు. ఉమ్మడి రాష్ట్రంలో దండుగన్న తెలంగాణ వ్యవసాయం బీఆర్ఎస్ హయాంలో పండుగలా మారిందని పునరుద్ఘాటించారు.

**రైతు సంక్షేమమే తొలి ప్రాధాన్యత..**

రైతు సంక్షేమమే తొలి ప్రాధాన్యతగా నాడు అమలు చేసిన కార్యాచరణ పదేళ్ల అనతికాలంలో సత్ఫలితాలనిచ్చిందని తెలిపారు. అందులో భాగంగా 24 గంటల

మిగతా 2లో



## కాంగ్రెస్ ఎగవేతల ప్రభుత్వం

రైతు డిక్లరేషన్ అమలు చేయరా

ప్రభుత్వ పథకాలన్నీ మోసాలే..

రైతులను కుడి ఎడమలుగా దగా

రేవంత్ ఇచ్చిన చెక్కు ఏమైంది?

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**హైదరాబాద్:** కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ఏమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. సంగారెడ్డిలో హరీశ్‌రావు సోమవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎగవేతల ప్రభుత్వం అన్నారు. రూ. 15వేలు రైతుభరోసా ఇస్తామని మోసం? చేశారని మండిపడ్డారు.

మిగతా 2లో



## 4 పథకాలకు రూ.45వేల కోట్లు

రెవెన్యూ రికార్డుల ఆధారంగా రైతుభరోసా

సెంటు భూమిలేని వ్యవసాయ కూలీలకే ఆత్మీయ భరోసా

దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నాలుగు కొత్త పథకాల అమలుపై సమీక్ష

**ఖమ్మం:** తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ సంక్రాంతి గొప్ప పండుగలా చరిత్రలో నిలిచిపోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన నాలుగు కొత్త సంక్షేమ పథకాల అమలు సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు.

**అమల్లోకి నాలుగు పథకాలు..**

ఈ సంక్రాంతి నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి నాలుగు పథకాలను ప్రభుత్వం అమల్లోకి తెస్తుందన్నారు. నాలుగు పథకాల అమలుకు సుమారు 40 నుంచి 45 వేల కోట్ల అధిక భారం పడుతుందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమం కోసం ప్రజాప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు.

**రెవెన్యూ రికార్డుల ఆధారంగా రైతుభరోసా..**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి

మిగతా 2లో

## యానాంలో కొత్త అల్లుడికి మెగా విందు

2 లో





## పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

ఈ నెల 26 నుంచి పథకం ప్రారంభం

72 గజాల్లో రూ.5లక్షలతో నిర్మాణం

ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కూసుమంచిలో తొలి మోడల్ హౌస్ ప్రారంభం

2 లో



## వినూత్న నిరసన

గాడిదకు కౌశిక్‌రెడ్డి ఫొటోతో ఊరేగింపు

సంజయ్ అనుచరుల ఆగ్రహం

పాడిపై మూడు కేసులు నమోదు

2 లో

# భక్తజనసంద్రం.. త్రివేణి సంగమం

మహా కుంభమేళా ప్రారంభం

ప్రయాగ్‌రాజ్‌కు పోటెత్తిన భక్తులు

త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు

45 రోజులపాటు జరుగనున్న కుంభమేళా

35కోట్ల మంది వస్తారని అంచనా

45వేల మంది పోలీసులతో భద్రత

2 లో



# తెలుగు లోగిళ్లలో భోగి వేడుకలు



**నెట్‌వర్క్:** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల జరిగే ఈ వేడుకల్లో భాగంగా తొలి రోజు సోమవారం భోగి పండుగ వేడుకలను ఊరువాడ సందడిగా జరిగాయి. తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు భోగి మంటల చుట్టూ పాడుతూ, డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల ముందు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. పోటీపడి మరీ రథం ముగ్గులు వేశారు. వాటిలో గొబ్బెమ్మలను పెట్టారు. పిల్లలకు రేగిపండ్లతో స్నానాలు చేయించారు. హరిదాసులతోపాటు అలంకరించిన బసవన్నలు, గాలి పటాలను ఎగురవేస్తూ యువకులు సందడి చేశారు. ఇలా పల్లెల్లో సంక్రాంతి శోభ ఉట్టి పడింది.

**హైదరాబాద్‌లో..**

భాగ్యనగరంలో భోగి వేడుకల్లో చిన్నా పెద్ద అంతా కలిసి పాల్గొన్నారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, నిజాంపేట్, ప్రగతినగర్, గేటెడ్ కమ్యూనిటీస్, అపార్ట్‌మెంట్లలో భోగి సంబురాలు చేసుకున్నారు. ఇళ్ల ముందు భోగి మంటలు వేసి సందడి చేశారు. భవ్యస్ తులసీవనం గేటెడ్ కమ్యూనిటీలో భోగి మంటలు కోలాహలంగా జరిగాయి. ఖమ్మం జిల్లా కూసుమంచిలో జరిగిన భోగి వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

**ఏపీలో జోరుగా కోడి పందేలు..**

ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించారు. విజయవాడ, కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని సూరంపల్లి, రామవరప్పాడు, అంపాపురంలో నిర్వహించారు. పల్లెల్లోని బరుల్లోనూ పందేలు ఏర్పాటు చేశారు. వీటిని చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా సాగాయి. నందిగామ, చందర్లపాడులో పోటీలు కొనసాగాయి. కంచికచర్ల మండలం గండేపల్లి వద్ద టెంట్లు ఏర్పాటు చేసి భారీ ఎత్తున పందేలు నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడి పందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ప్రారంభించారు.

**లక్షల్లో పందేలు..**

కోడి పందేలు రూ.లక్షల్లో జరిగాయి. బరుల్లో పందేల గురించి బహిరంగంగా ప్రకటనలు చేశారు. పందెం రాయుళ్లు కత్తులు కట్టి కోడి పుంజులను బరిలోకి వదిలారు. నగదు తీసుకురాని వారి కోసం బరుల నిర్వాహకులు స్పాట్ క్యాష్ సౌలభ్యం ఏర్పాటు చేశారు. పందేలను వీక్షించేందుకు గ్యాలరీలు సైతం ఏర్పాటు చేశారు.

**నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు..**

చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో భోగి వేడుకల్లో సీఎం చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడారు. పలువురి నుంచి వివిధ సమస్యలపై వినతి పత్రం తీసుకున్నారు. అనంతరం సీఎం సతీమణి నారా భువనేశ్వరి మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించగా.. వాటిని సీఎం తిలకించారు. సీఎం రాకతో నారావారిపల్లె ప్రత్యేక శోభను సంతరించుకుంది. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన భోగి వేడుకల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగి మంటలు అంటించి వేడుకలను ప్రారంభించారు.

**సంతోషంగా ఉంది : జనసేనాని పవన్**

పండుగ సందడితో తెలుగు రాష్ట్రాల పల్లెలు శోభాయమానంగా మారాయని జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సూర్య భగవానుడు మకర రాశిలోకి ప్రవేశించే పుణ్య సమయాన ధాన్య రాశులను లోగిళ్లకు మోసుకువచ్చే సంక్రాంతి వేళ భారతీయులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.

**పల్లె సౌభాగ్యమే దేశ సౌభాగ్యం..**

రంగవల్లులు.. గొబ్బెమ్మలు.. గంగిరెద్దులు.. హరిదాసులు.. భోగిమంటలు.. పిండివంటల సమ్మేళనమే సరదాల సంక్రాంతి అన్నారు. అలాంటి సరదాల కోసం నగరాలన్నీ పల్లెలవైపు పరుగులు తీశాయని చెప్పారు. ఇది ప్రజలకు పండుగపై ఉన్న మక్కువను తెలియజేస్తోందన్నారు. ఉపాధికోసం పల్లె బిడ్డలు నగరాలకు వలసపోవడంతో గ్రామాలు జనాలు లేక కొంతవరకు పలుచబడ్డాయని, సంక్రాంతి పండుగ వేళ పల్లెలు పిల్లాపాపలతో కళకళలాడుతుంటే సంతోషంగా ఉందని చెప్పారు. పల్లె సౌభాగ్యమే దేశ సౌభాగ్యం అన్నారు. ఆనందాలు, సిరి సంపదలతో పల్లెలు సుభిక్షంగా శోభిల్లాలని ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు.



## యానాంలో కొత్త అల్లుడికి మెగా విందు

### 470 రకాల వెరైటీలతో భోజనం

### సంక్రాంతి పండుగకు ఏర్పాటు

**యానాం:** ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి పండుగకు వెళ్లిన కొత్త అల్లుళ్లకు వందల రకాల వంటకాలతో వడ్డించడం అందరికీ తెలిసిన విషయమే. ఈ సంక్రాంతి సందర్భంగా యానం జిల్లాలో కొత్త అల్లుడికి 470 రకాల వంటలతో రుచి చూపించారు. ఈ వీడియో ఇప్పుడు కాస్త వైరల్‌గా మారింది. భోగి రోజు తమ ఇంటికి వచ్చిన కొత్త అల్లుడికి 470 రకాల వంటలు చేసి రుచి చూపించారు.

**అపురూప విందును ఊహించలేదు..**

కేంద్ర పాలిత ప్రాంతం యానాం వర్తకసంఘం గౌరవాధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, వెంకటేశ్వరి దంపతుల ఏకైక కుమార్తె హరిణ్యకు గతేడాది విజయవాడకు చెందిన పారిశ్రామికవేత్త సాకేత్‌తో వివాహం జరిపించారు. కొత్త అల్లుడిని మొదటి సంక్రాంతి పండుగకు ఆహ్వానించి ప్రత్యేక విందును ఏర్పాటుచేసి ఆశ్చర్యపరిచారు. శాకాహారం, పిండి వంటలు, స్వీట్లు, పండ్లు, డ్రై ఫ్రూట్స్, శీతల పానీయాలు.. ఇలా సుమారు 470 రకాల అరిటాకులపై చిన్న చిన్న కప్పులలో ఉంచి వాటిని అందంగా అలంకరించి ఇద్దరినీ విందుకు ఆహ్వానించారు. మెగా విందులో వంటకాలు చూసి విజయవాడ అల్లుడు సాకేత్ ఉబ్బితబ్బిబ్బయ్యారు. అత్తవారింట్లో ఏర్పాటుచేసిన అపురూప విందును ఊహించలేదని.. శాకాహారంలో ఇన్ని రకాల ఉంటాయని ఇప్పుడే చూశాను అని అల్లుడు సాకేత్ తెలిపారు.

**ఆంధ్రా అల్లుడికి తెలంగాణ రుచి..**

సంస్కృతి, సంప్రదాయం ఈ సంక్రాంతికి తెలంగాణను సైతం చుట్టుముట్టింది. హైదరాబాద్, మెదక్ జిల్లాల్లో కొత్త అల్లుళ్లకు వందకు పైగా రుచులను వడ్డించి సర్‌ప్రైజ్ చేశారు అత్తింటివారు. కాకినాడకు చెందిన మల్లికార్జున్‌కు హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌కు చెందిన యువతితో వివాహం అయింది. సంక్రాంతి సందర్భంగా తెలంగాణకు వచ్చిన అల్లుడికి అత్తమామ ఖమ్మం పాటి క్రాంతి, కల్పన దంపతులు 130 రకాల విభిన్న రకాల వంటకాలను వడ్డించారు. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మాజీ సర్పంచ్ మంగ రాములు తన అల్లుడు, కుమార్తెను సంక్రాంతికి ఆహ్వానించి పసందైన 108 రకాల వంటకాలతో విందు భోజనం వడ్డించి ఆహా అనిపించారు.

# పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**ఖమ్మం:** రాష్ట్రంలో ప్రతి నిరుపేద సొంతింటి కలను ఇందిరమ్మ ప్రభుత్వం నెరవేరుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో రాష్ట్రంలోనే మొట్టమొదటి ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ఎంపీ రామసహాయం రాఘురామ్‌రెడ్డి, ఖమ్మం అడినల్ కలెక్టర్ శ్రీజతో కలిసి ప్రారంభించారు.

**ఈ నెల 26న పథకం ప్రారంభం..**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈ నెల 26 నుంచి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించనున్నదని, 72 గజాల్లో 400 ఎస్ఎఫ్‌టీలో ఇందిరమ్మ ఇంటిని రూ.5లక్షల వ్యయంతో పార్టీలు, కులమతాలకతీతంగా అర్హులకు నిర్మించి ఇవ్వనుందని పేర్కొన్నారు. మొదటి విడతగా నాలుగున్నర లక్షల ఇండ్లు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3500 గ్రీన్ చానల్ ద్వారా నిర్మిస్తామని తెలిపారు. రాబోయే నాలుగేండ్లల్లో 20 లక్షల ఇండ్ల నిర్మాణాలు చేపడుతామన్నారు. గత పాలకులు అప్పట్లో 1.52లక్షల ఇండ్లకు టెండర్లు పిలిచి లక్ష కూడా నిర్మించలేదని, అసంపూర్తిగా ఉన్నవాటిని కూడా తామే పూర్తి చేసి పేదలకు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

**నాలుగు దశల్లో నగదు చెల్లింపులు..**

ఇంటి స్థలం ఉన్న పేదవారికి రూ.5లక్షలు నాలుగు విడతలుగా చెల్లిస్తామని మంత్రి తెలిపారు. పునాది దశలో రూ.లక్ష, కిటికీ నిర్మాణ దశలో రూ.1.25లక్షలు, స్లాబ్ వేయడంతో రూ.1.75లక్షలు, మిగిలిన రూ.లక్ష ఇంట్లోకి వెళ్లగానే ఇస్తామని తెలిపారు. ఎలాంటి దళారుల పాత్ర ఉండదని, గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏంటో ప్రజలకు తెలుసని, రాష్ట్రాన్ని ఆనాటి పాలకులు ఎలా కొల్లగొట్టారో తెలుసని మంత్రి పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా రైతు భరోసా కింద ఎకరాకు రూ.12వేలు ఇస్తున్నామని తెలిపారు.

**రైతుభరోసా రూ.12వేలు**

రైతులకు రైతుభరోసా నిబంధనలు లేకుండా రూ.12వేలు ఇస్తామని మంత్రి తెలిపారు. పదేండ్లలో ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారు. నాలుగు కార్యక్రమాలు ఈ నెల 26 నుంచి అమలు చేయబోతున్నట్లు ప్రకటించారు.

# వినూత్న నిరసన

**హైదరాబాద్:** కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్ కుమార్ ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడం సంచలనంగా మారింది. సమావేశంలో మైక్‌లో మాట్లాడుతున్న సంజయ్‌ను కౌశిక్ అడ్డుకున్నారు. నువ్వు ఏ పార్టీ అని.. దమ్ముంటే కాంగ్రెస్‌పై గెలవాలని పట్టుబడ్డారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో సమీక్షా సమావేశం గందరగోళంగా మారింది. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి కౌశిక్‌రెడ్డిని అక్కడి నుంచి తీసుకెళ్లారు.

**సంజయ్ అనుచరుల ఆగ్రహం..**

ఎమ్మెల్యే సంజయ్‌పై కౌశిక్ దాడి చేయడంపై సంజయ్ అనుచరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పాడికి వ్యతిరేకంగా వినూత్నంగా నిరసనకు దిగారు. కరీంనగర్ సమావేశంలో సంజయ్‌పై కౌశిక్ రెడ్డి అనుచిత ప్రవర్తను నిరసనగా బీఆర్ఎస్



ఎమ్మెల్యే ఫొటోను గాడిదకు కట్టి ఊరేగించారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**కౌశిక్‌పై మూడు కేసులు నమోదు..**

కౌశిక్‌రెడ్డికి పోలీసులు కూడా బిగ్ షాక్ ఇచ్చారు. ఎమ్మెల్యేపై కరీంనగర్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదు చేశారు. కరీంనగర్ ఆర్డీవో, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పీఏల ఫిర్యాదు పోలీసులు కేసు ఫైల్ చేశారు. ఆయనపై బీఎన్ఎస్ యాక్టు 132, 115 (2), 352,292 కింద కేసులు నమోదయ్యాయి. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సమక్షంలో జరిగిన కరీంనగర్ జిల్లా సమావేశంలో పాడి కౌశిక్ రెడ్డి వ్యవహించిన తీరుపై మంత్రులు కూడా అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే తీరును వారు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యేపై దాడి సరైంది కాదని, కౌశిక్ రెడ్డి ప్రవర్త ఏమాత్రం బాగోలేదని వ్యాఖ్యలు చేశారు.

**స్పీకర్‌కు ఫిర్యాదు..**

మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఎమ్మెల్యే సంజయ్ ఫిర్యాదు చేశారు. తనపై దురుసుగా ప్రవర్తించాడని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తన హక్కులకు భంగం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కౌశిక్‌రెడ్డి తనపై అసభ్య పదజాలంతో దూషించాడని సోమవారం స్పీకర్‌ను కలిసి కంప్లైంట్ చేశారు. పాడి కౌశిక్ రెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారనేది ఉత్కంఠగా మారింది.

# భక్తజనసంద్రం.. త్రివేణి సంగమం

**ప్రయాగ్‌రాజ్:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ఘనంగా ఆరంభమైంది. గంగా, యమునా, సరస్వతీ నదుల సంగమ ప్రదేశం ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటెత్తారు. పుష్య పౌర్ణమి అయిన సోమవారం తెల్లవారుజాము నుంచే లక్షలాదిమంది భక్తులు త్రివేణి సంగమానికి చేరుకొని పవిత్ర స్నానాలు ఆచరించారు. భక్తుల పూజలతో ఈ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగుతోంది. కోటి మందికిపైగా భక్తులు వచ్చారని అధికారులు వెల్లడించారు.

**5 రోజులపాటు..**

45 రోజులపాటు జరిగే మహాకుంభమేళాకు దేశ విదేశాల నుంచి కోట్ల మంది భక్తులు, పర్యాటకులు రానున్నారు. మొత్తం 35 కోట్ల మంది వస్తారని యూపీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. భక్తులకు మెరుగైన సౌకర్యాలతోపాటు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అన్నిఏర్పాట్లు చేసింది. నదిలో నిరంతరం పహారా కాసేందుకు ప్రత్యేకంగా తేలియాడే పోలీసుస్టేషన్ ఏర్పాటుచేశారు. చిన్నచిన్న పడవలపై భద్రతా సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారు.

**ప్రత్యేక ఏర్పాట్లు..**

ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహాకుంభమేళా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక మంది భక్తులను ఆకర్షిస్తుంది. కుంభమేళాకు హాజరయ్యే భక్తులు పలు రకాలుగా తరలివస్తున్నారు. 10 వేల ఎకరాల్లో కుంభమేళాకు ఏర్పాట్లు జరిగాయని, ఏ సమయంలోనైనా 50లక్షల మంది నుంచి కోటి మంది ఉండగలిగేలా సౌకర్యాలను కల్పించామని సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. వీఐపీలకు ప్రత్యేక కాటేజీ సౌకర్యాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. 30వేలకు పైగా రైళ్లను కూడా రైల్వే శాఖ ప్రకటించినట్లు తెలిపారు.

**రూ.7వేల కోట్లు ఖర్చు..**

భక్తులకు సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.7వేల కోట్లు ఖర్చు చేస్తున్నది. ఎన్‌డీఆర్ఎఫ్ వాటర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేసింది. యాత్రికులకు ఇబ్బంది లేకుండా 1.6 లక్షల టెంట్లను, 1.5 లక్షల మరుగు దొడ్లను నిర్మించారు. భద్రత కోసం 55 పోలీస్‌స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. 45వేల మంది పోలీసులను మోహరించింది. సాధువులకు సంబంధించిన 13 అఖాడాలు కుంభమేళాలో భాగం కానున్నాయి.

**హెలికాప్టర్ రైడ్..**

భక్తుల కోసం ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వం చాలా చౌకగా హెలికాప్టర్ సర్వీస్?ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ఛార్జీ రూ.1,296. దీనివల్ల మహాకుంభ మేళా, ప్రయాగ్?రాజ్ నగరాన్ని గగనతలం నుంచి తిలకించే అవకాశం లభిస్తుంది. ఇది వరకు ఈ హెలికాప్టర్ ఛార్జీ రూ.3వేలు ఉండేది. హెలికాప్టర్‌లో పర్యటించాలనుకునే వాళ్లు ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్ www.upstdc.co.in టికెట్లను బుక్ చేసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్‌ప్రదేశ్ పర్యటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి జైవీర్ సింగ్ తెలిపారు.

**24, 26 తేదీల్లో డ్రోన్ షో..**

అలాగే జల, సాహస క్రీడలపై ఆసక్తి ఉన్న పర్యటకుల కోసం ఉత్తర్?ప్రదేశ్ పర్యటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ ఈ నెల 24, 26 తేదీల్లో డ్రోన్ షో, వాటర్ లేజర్ షో వంటివి నిర్వహించనుంది. గంగా పండల్‌లో ఈ నెల 16న బాలీవుడ్ గాయకుడు శంకర్ మహదేవన్ సంగీత ప్రదర్శన ఉంటుందని తెలిపింది.

**ఆధ్యాత్మిక వారసత్వం కుంభమేళా : మోదీ**

కుంభమేళా ప్రారంభంపై ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. 'భారతీయ విలువలు, సంస్కృతిని గౌరవించే కోట్లాది మందికి ఇది చాలా ప్రత్యేకమైన రోజు. ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా ప్రారంభమైంది. విశ్వాసం, భక్తి , సంప్రదాయాల సంగమంతో ఎంతోమందిని ఒకచోట చేర్చింది. మన దేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఈ వేడుక ప్రతిబింబిస్తుంది. పవిత్ర స్నానాలు ఆచరించి, భగవంతుడి ఆశీస్సులు తీసుకునేందుకు లెక్కలేనంతమంది రావడం ఎంతో సంతోషంగా ఉంది' అని మోదీ రాసుకొచ్చారు.

## మొదటి పేజీ తరువాయి

### పదేళ్ల ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగించాలి

ఉచిత నాణ్యమైన కరెంటు, ప్రాజెక్టులు, కాల్వల ద్వారా సాగునీరు, పంటలకు పెట్టుబడిగా రైతుబంధు, రైతు కుటుంబాలకు భరోసాగా రైతుబీమా వంటి పథకాలను పటిష్టంగా అమలు చేశామని పేర్కొన్నారు. తద్వారా సాధించిన వ్యవసాయ ప్రగతి ప్రపంచవ్యాప్తంగా పలు ప్రశంసలు పొందిందన్నారు.

**దేశానికి తెలంగాణ ఆదర్శం..**

దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలిచిందని గుర్తుచేశారు. వ్యవసాయానికి దన్నుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన కులవృత్తులకు గతంలో లేని విధంగా ప్రోత్సహించామన్నారు. ఆర్థిక సహకారం సబ్బండ కులాల జీవితాల్లో సంక్రాంతి శోభ నింపిందన్నారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం పండుగ కావాలని, పాడి పంటలతో రైతు కుటుంబాలు సంతోషంతో నిండాలని, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రారంభించిందని గుర్తుచేశారు.

### కాంగ్రెస్ ఎగవేతల ప్రభుత్వం

రుణమాఫీకి నవంబర్ 30న సీఎం రేవంత్ ఇచ్చిన చెక్కు ఏమైందని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడేమో సెంటు భూమి ఉన్నా ఇవ్వబోమంటున్నారని మండిపడ్డారు.

**కాంగ్రెస్ మోసాలను చెప్పండి..**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఎలా మోసం చేస్తోందో పండుగకు ఊళ్లకు వెళ్లేవారు రైతులకు చెప్పాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలన్నీ మోసాలేనని స్పష్టం చేశారు. రైతులను కుడి ఎడమలుగా దగా చేస్తోందన్నారు. రైతుల విషయంలో కాంగ్రెస్ పార్టీ మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు గడపదాటడం లేదని విమర్శించారు. రైతు రుణమాఫీ గురించి పాలమూరు జిల్లాలో రెండు నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి రూ.2వేల 750 కోట్ల రుణమాఫీ విడుదల చేసినట్లు చెక్ ఇచ్చారని, ఇప్పటికీ కూడా సంగారెడ్డికి డబ్బులు రాలేదన్నారు. ఇంతకుముందే మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా రైతులతో మాట్లాడినట్లు చెప్పారు. సీఎం ఇచ్చిన చెక్‌కు విలువ లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో డమ్మీ హామీలు ఇచ్చినట్లు..? నీవు ఇచ్చిన చెక్ ఎందుకు పాసుకావడం లేదని, దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**అధికారులు తప్పు చేస్తే చర్యలు తీసుకోండి..**

అధికారులు తప్పు చేస్తే చర్య తీసుకోవాలని కోరారు. చెక్ బౌన్స్ అయిందా..? లేదా చెక్ దారి తప్పిపోయిందా..? ఎందుకు రైతుల అకౌంట్లలో డబ్బులు పడటం లేదని ప్రశ్నించారు. అందరికీ రుణమాఫీ అని కొంతమందికే పరిమితం చేశారని ఆరోపించారు. రూ.2లక్షల కంటే ఎక్కువ ఉన్న వారు అప్పులు తెచ్చి కడితే కూడా ఇప్పటికీ రుణమాఫీ కాలేదన్నారు. బోనస్ బోగస్‌గా మారిందని హెద్దేవా చేశారు.

**రైతు వ్యతిరేక ప్రభుత్వం..**

రైతుభరోసా రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12 వేలు ఇస్తూ దగా చేసిందన్నారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. ఎన్నికలప్పుడు అరచేతిలో వైకుంఠం చూపి, ఎన్నికలయ్యాక మొండిచేయి చూపిస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనలో రైతులను కాపాడుకున్నారని గుర్తుచేశారు. రేవంత్ 13 నెలలో ఎలా మోసం చేశారో గ్రామాల్లోని రైతులు, ప్రజలకు తెలియజేశాలని కోరారు. రైతులను రేవంత్ మోసం చేసిన తీరుపై చర్చ పెట్టాలని సూచించారు. అయితే ఎగవేతలు.. లేదంటే కోతలు.. ఈ విధంగా రైతులకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. రైతుల కష్టాలు తెలుసుకుని వారికి భరోసా ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీపై పోరాటానికి సన్నద్ధం కావాలని పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు.

### 4 పథకాలకు రూ.45వేల కోట్లు



రూ.22,500 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.2000 కోట్లు, రైతుభరోసాకు రూ.19వేల కోట్లు చొప్పున ఖర్చు చేసుకుంటూ ముందుకెళ్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక, అమలుకు విధివిధానాలు లోతుగా చర్చించిన తర్వాతే రాష్ట్ర కేబినెట్ ప్రకటన చేసిందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటినీకి పరిమితి లేకుండా ఎకరాకు ఏడాదికి రూ.12వేల చొప్పున రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతులకు కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా, వ్యవసాయ శాఖ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు.

**వ్యవసాయ కూలీలకే ఆత్మీయ భరోసా..**

ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు తీసుకున్న కుటుంబం కనీసం 20రోజులు పనిచేసి ఉండి సెంటు భూమి కూడా లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అందుతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సైతం పూర్తిగా అర్హులనే ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల నుంచి అమలు చేయబోయే నాలుగు కొత్త పథకాలకు గ్రామ సభలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీలది కీలకపాత్ర..**

పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీలదే కీలకపాత్ర అన్నారు. గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక చేస్తామన్నారు. గ్రామసభల్లోని అర్హులైన వారికి పథకాల అనుమతి పత్రాలు అందజేస్తారని తెలిపారు. ప్రభుత్వ జీవో ప్రకారం సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయా లేదా అనేది ఇందిరమ్మ కమిటీలు పర్యవేక్షిస్తాయన్నారు. లబ్ధిదారుల గుర్తింపు, అర్హుల జాబితా అన్నీ కూడా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం ఉండాలని తెలిపారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల పేర్లు, వారు పొందిన నగదు మొత్తాన్ని అందరికీ కనిపించేలా పెద్ద అక్షరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పథకాల అమలులో కలెక్టర్లకు ఎలాంటి సందేహాలు ఎదురైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రితో మాట్లాడి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

**మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన..**

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా రూ.54 కోట్ల వ్యయంతో 27 చెరువుల కింద 2400 ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుందని చెప్పారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఆయన మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. ఉగాదిలోపే ఈ ప్రాజెక్టును నిర్మించబోతున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరివ్వాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నామన్నారు.

## పండుగ పూట నీటి కష్టాలు

**హైదరాబాద్:** నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం నుంచి 24 గంటల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ఓ ప్రకటనను విడుదల చేసింది. హైదరాబాద్‌కు తాగు నీటిని సరఫరా చేసే మంజీరా ప్రాజెక్ట్ ఫేజ్ –2లో మరమత్తుల కారణంగా నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు అధికారులు తెలిపారు. కలబ్‌గూర్ నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయామీటర్ పంపింగ్ మెయిల్‌లో పలు చోట్ల భారీగా లీకేజ్‌లు ఏర్పడిందని.. దీనివల్ల నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని జలమండలి అధికారులు వెల్లడించారు. లీకేజ్ మరమత్తులు చేపట్టామని.. దీంతో తాత్కాలికంగా నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు. దాదాపు 24 గంటల పాటు.. అంటే ఈరోజు ఉదయం 6 గంటల నుంచి రేపు ఉదయం (జనవరి 14) 6 గంటల వరకు నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు వెల్లడించారు. నీటి సరఫరాలో అంతరాయం నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు సూచనలు చేశారు.

## గత ఏడాదిలో హతమైన ఉగ్రవాదుల్లో పాకిస్తానీయులే ఎక్కువ : ఆర్మీచీఫ్

**న్యూఢిల్లీ:** గతేడాది హతమైన ఉగ్రవాదుల్లో 60 శాతం మంది పాకిస్తాన్ సంతతికి చెందిన వారేనని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. హింసను ప్రేరేపించేందుకు పాకిస్తాన్ పాత్ర ఏంటో ఈ చర్యతో తెలిసి పోతుందన్నారు. జనవరి 15వ తేదీన ఆర్మీ డే సందర్భంగా ఆర్మీ చీఫ్ జనరల్ సోమవారం మీడియాతో మాట్లాడారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లో హింసను ప్రేరేపిస్తున్నారని తెలిపారు. ఉగ్రవాద చర్యలను నిరోధించేందుకు గతేడాది 15 వేల మంది సైనికులను చేర్చుకుకోవడంతో ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకం అభివృద్ధి చెందుతున్న సమయంలోనే ఉగ్రవాదులు తమ చర్యలను వేగం చేశారు. ఈ ఉగ్రవాదుల్లో 80 శాతం మంది పాకిస్తానీలు ఉన్నారని, గతేడాది 60 శాతం మందిని అంతమొందించామని తెలిపారు. ఇక భారత్, చైనా సైన్యాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నాలు అవసరమని పేర్కొన్నారు. సరిహద్దుల్లో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలు పెంచడం, కెపబిలిటీ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించామని తెలిపారు. చొరబాటు ప్రయత్నాలను అడ్డుకుంటున్నామని ఆర్మీ చీఫ్ స్పష్టం చేశారు.
కుంభమేళాకు హాజరైన

## ఆపిల్ సహ వ్యవస్థాపకులు దివంగత స్టీవ్ జాబ్స్ భార్య

**ప్రయాగ్‌రాజ్:** ఆపిల్ సహ వ్యవస్థాపకులు దివంగత స్టీవ్ జాబ్స్ భార్య, ప్రపంచంలో అత్యంత ధనవంతురాలైన మహిళల్లో ఒకరైన లారెన్ పావెల్ మహా కుంభమేళాకు హాజరయ్యారు. 40 మంది సభ్యులతో కూడిన బృందంతో ఆమె ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు తరలివచ్చారు. రెండు రోజుల క్రితమే (ఈ నెల 11న) భారత్‌కు చేరుకున్న 61 ఏండ్ల లారెన్.. నిరంజని అఖాడాకు చెందిన ఆచార్య మహామండలేశ్వర్ స్వామి కైలాషానంద శిబిరంలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన ఆమెకు శిబిరం వద్ద స్వామీజీలు ఘనంగా స్వాగతం పలికారు. లేత పసుపు వర్ణంలో వస్త్రాలు ధరినంచిన లారెన్.. చేతికి రక్షా సూత్ర, మెడలో రుద్రాక్ష మాల ధరించి ఉన్నారు. ఆమె ఈ నెల 15 వరకు అక్కడే ఉంటారు. అనంతరం నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొనేందుకు అమెరికాకు తిరిగి వెళ్లనున్నారు. ప్రయాగ్‌రాజ్ రావడానికి ముందు వారణాసిలోని కాశి విశ్వనాథ ఆలయాన్ని సందర్శించారు. లారెన్ పావెల్.. ప్రపంచంలోని అత్యంత సంపన్న మహిళల్లో ఒకరు. ఆమె ఆస్తి 15 బిలియన్ల డాలర్లు. స్టీవ్ జాబ్స్ భార్య అయిన లారెన్ పావెల్ యాపిల్ కంపెనీ షేర్స్ నుంచి ఆస్తిని వారసత్వంగా పొందారు. 2021లో ఆమె వేవెర్లీ స్ట్రీట్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. దీనికి వచ్చే నిధులను పర్యావరణ మార్పులను పరిష్కరించేందుకు కేటాయిస్తున్నారు. ఆపిల్ వ్యవస్థాపకుల్లో ఒకరైన స్టీవ్ జాబ్స్ 2011, అక్టోబర్ 5న మరణించిన విషయం తెలిసిందే.

## జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ

### పటిష్ట భద్రతను ఏర్పాటు చేసిన అధికారులు

### జడ్ మోడ్ సొరంగం పొడవు 6.5 కిలోమీటర్ల

### టన్నెల్ నిర్మాణం కోసం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం జమ్ముకశ్మీర్‌లోని సోన్‌మార్గ్ ప్రాంతంలో జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించారు. ప్రధాని రాక నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో అధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. టన్నెల్ ప్రారంభోత్సవంలో జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొన్నారు. శ్రీనగర్ నుంచి కార్గిల్ వెళ్లే దారిలో శ్రీనగర్–లేహ్ జాతీయ రహదారిపై ఈ టన్నెల్‌ను నిర్మించారు. ఈ టన్నెల్ నిర్మాణం కోసం ఏకంగా రూ. 2,500 కోట్లు ఖర్చు చేశారు. భారత రక్షణ రంగానికి వ్యూహాత్మకంగా ఈ టన్నెల్ చాలా కీలకం కానుంది. ఈ జడ్ మోడ్ సొరంగం 6.5 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ టన్నెల్ ద్వారా ఏ సీజన్‌లోనైనా లడఖ్‌కు చేరుకోవడానికి వీలవుతుంది. టన్నెల్‌కు సంబంధించి 2015లో ప్రారంభమైన నిర్మాణ పనులు గత ఏడాది పూర్తయ్యాయి. ఈ జెడ్ మోడ్ టన్నెల్ భారత్‌కు వ్యూహాత్మకంగా చాలా కీలకమైనది. దాదాపు సముద్రమట్టానికి 8,500 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మించారు. అత్యంత శీతలమైన లడఖ్‌ను ఏ సీజన్‌లో అయినా సందర్శించేందుకు ఈ టన్నెల్ ఉపయోగపడనుంది. ఈ సొరంగం రవాణా వ్యవస్థతోపాటు రక్షణ వ్యవస్థకు కూడా కీలకం కానుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సోనామార్గ్ పట్టణానికి టన్నెల్ ద్వారా వెళ్లొచ్చు. జమ్ముకశ్మీర్‌లో 'జడ్ మోడ్' టన్నెల్ ఏర్పాటుతో కార్గిల్ మరింత సురక్షితంగా మారింది. గతంలో కార్గిల్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడగా భారత్ ఏకంగా యుద్ధమే చేయాల్సి వచ్చింది. శీతాకాలంలో తీవ్రంగా మంచు కురిసే సమయాన్ని ఆసరా చేసుకుని ఉగ్రవాదులు భద్రతాబలగాలపై దాడులకు తెగబడ్డారు. అప్పట్లో కార్గిల్ ప్రాంతం పాకిస్థాన్ ఉగ్రవాదుల హస్తగతమైతే శ్రీనగర్ లేహ్ మధ్య రాకపోకలు నిలిచిపోయేవి. ఇప్పుడు సొరంగం ద్వారా సైన్యం కార్గిల్‌కు వేగంగా చేరుకునే అవకాశం ఉంది.

# ప్రకృతితో కలిసి నడవడమే సంక్రాంతి పరమార్థం


మన వేదాలు, ఉపనిషత్తులు సృష్టిలోని ప్రతి దానిలోనూ భగవంతుడిని చూడాలని చెప్పాయి. ప్రతి ఒక్కరూ తనలాగే చూడగలిగితే జీవితం సంతోషంగా సాగిపోతుంది. ప్రకృతి పట్ల కృతజ్ఞతతో ఉండటం అంటే ప్రకృతిని నాశనం చేయకుండా ఉండడమే. ప్రకృతితో కలిసి బతకడమే. అలా జీవించగలిగినప్పుడే ఎలాంటి విపత్తులు రావు. సంక్రాంతి కూడా ప్రకృతికి కృతజ్ఞత చెప్తూ జరుపుకునే పండుగే. సంక్రమణంలో భాగంగా పుష్య మాసంలో సూర్యుడు ధనూరాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. ఆ పర్వకాలమే సంక్రాంతి. ఇది మూడు రోజుల పర్వం. పంట చేతికి అందటం వల్ల రైతులు ఆనందోత్సాహాలతో గడిపే సమయం ఇది. తమకు పాడిపంటలనిచ్చిన పండుగగా రైతులు సంక్రాంతిని కృతజ్ఞతా పూర్వకంగా జరుపుకొంటారు. పంటను చేతికిచ్చిన భగవంతుడికి, పొలాల్ని దున్నే ఎద్దులకు ఈ పండుగ ద్వారా ధన్యవాదాలు తెలుపుతారు. భోగి, సంక్రాంతి, కనుమ పర్వాల్లోని అంతరార్థం ఇదే. ఈ పండుగ నాటికి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం ఇంటికి చేరుతుంది. అందుకే సంతోషంతో ఈ పండుగ చేసుకుంటారు. తమకు వ్యవసాయంలో సహాయం చేసిన పశువులకు కృతజ్ఞతతో పూజిస్తారు. విత్తనం వేసింది మొదలు పంట నూర్పుళ్ళ వరకు సహాయం చేసినందుకు కూలీలకు పండిన ధాన్యంలో కొంత ఇస్తారు. అలాగే గంగిరెద్దుల హరిదాసులు, జంగాలు అందరూ ఈ పండగ రోజుల్లో కనిపిస్తారు. ప్రజలు సంతోషంగా వాళ్లకు దానధర్మాలు చేస్తారు. అందరూ కలిసి జీవించే సమైక్య జీవనానికి ప్రతీక సంక్రాంతి పండుగ. మకర సంక్రాంతి సూర్యుణ్ని ఉద్దేశించి చేసే మహా పర్వదినం. సూర్యుడు మానవ ప్రపంచానికి నేత్రం వంటివాడు. అతను లేకుంటే ప్రపంచానికి వెలుగు ఉండదు. సూర్యుడే మానవాళికి ఆరోగ్య ప్రదాత. సూర్యకాంతి వల్లే ప్రకృతి వికసిస్తుంది. సౌందర్యాన్ని ఆవిష్కరిస్తుంది. మేఘాలు ఏర్పడతాయి. వర్షాలు కురుస్తాయి. పంటలు పండుతాయి. చెట్లు పెరుగుతాయి. మానవుల జఠరాగ్ని ఆరిపోకుండా ఉంటుంది. శరీర అవయవాలన్నీ చక్కగా పనిచేస్తాయి. ఈ విధంగా మకర సంక్రాంతి ఆరోగ్య కారకమైన



పండుగగా కూడా విరాజిల్లుతున్నది.శ్రమైక జీవన సౌందర్యానికి, సామాజిక సమైక్య మాధుర్యానికి ప్రతీక సంక్రాంతి. సర్వజన హితాన్ని ఆకాంక్షిస్తూ, సమష్టి తత్వాన్ని ప్రతిబింబిస్తుంది ఈ పండుగ. తెలుగు లోగిళ్లను వెలుగు వాకిళ్లుగా మార్చే ముచ్చటైన, ముగ్ధమనోహరమైన మూడు పండుగల సమాహారంగా సంక్రాంతి సౌందర్యం వెల్లివిరుస్తుంది. సంక్రాంతి అంటే 'చేరుట' అని అర్థం కూడా ఉంది. సంక్రాంతికి ఒక రోజు ముందు భోగి పండుగతో సంబురాలు మొదలవుతాయి. భోగి అంటే భోగ భాగ్యాలను అనుభవించే రోజని అర్థం. పాడి పంటలు సమృద్ధిగా ఇళ్లకు వచ్చే సమయం కావటంతో రైతులు ఎంతో ఆనందంగా ఉంటారు. ఈ రోజు సూర్యోదయా నికి పూర్వమే నిద్రలేచి అభ్యంగన స్నానం చేసి, ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేస్తారు. పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ భోగి మంటల్లో పనికిరాని దుస్తులు, వస్తువులను వేసి పీడలను, అరిష్టాలను తొలగించుకుంటారు. భోగి పండుగ రోజు ఉదయం పిల్లలకు స్నానాలు చేయించి కొత్తదుస్తులు వేసి వారిని తూర్పు వైపునకు కూర్చోబెట్టి రేగుపళ్లు, చిల్లర నాణేలను కలిపి వారి తలపై పోస్తారు. తర్వాత పిల్లలకు హారతి ఇస్తారు. ఇలా చేయడం ద్వారా వారిపై పడిన దిష్టి తొలగిపోతుందని భావిస్తారు. అంతే కాకుండా పిల్లల ఎదుగుదలకు తోడ్పడు తుంది. బాహ్య నేత్రాలకు కనిపించని బ్రహ్మరంధ్రం తలపై భాగంలో ఉంటుంది. భోగిపళ్లను తలపై పోయడం ద్వారా అవి బ్రహ్మ రంధ్రాన్ని ప్రేరేపిస్తాయి. తద్వారా పిల్లల బుద్ధి వికసిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. మకర సంక్రాంతి విశేష పర్వదినం. సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే ఈ పుణ్యదినాన సూర్యునికి అర్ఘ్యాలు ఇవ్వడం, పూజలు చేయడం, దాన ధర్మాలు చేయడం పరిపాటి. కాల గమనం దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశిస్తున్నందున శరీరానికి సమతౌల్యం అవసరం. ఇందుకోసం నువ్వులు కలిపిన చక్కెరను తినడం, బెల్లంతో కలగలిపి చేసిన నువ్వుల లడ్డూలను తినడం కనబడుతుంది. పండుగ రోజున నెయ్యిని, కంబళ్లనూ, బెల్లాన్నీ, దానం ఇవ్వడం, ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులను వేయడం సంప్రదాయంగా వస్తున్నది. సూర్యుడి రథాన్ని ముగ్గుగా వేసి, దానిపై పేడతో చేసిన గొబ్బెమ్మలను, నువ్వులు, బియ్యం, చెరుకుగడలను ఉంచడం ప్రతి ఇంటి వాకిటా కనబడుతుంది.శ్రమైక జీవన సౌందర్యానికి, సామాజిక సమైక్య మాధుర్యానికి ప్రతీక సంక్రాంతి. సర్వజన హితాన్ని ఆకాంక్షిస్తూ, సమష్టి తత్వాన్ని ప్రతిబింబిస్తుంది ఈ పండుగ. తెలుగు లోగిళ్లను వెలుగు వాకిళ్లుగా మార్చే ముచ్చటైన, ముగ్ధమనోహరమైన మూడు పండుగల సమాహారంగా సంక్రాంతి సౌందర్యం వెల్లివిరుస్తుంది. ఎన్నో ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతులు, వైజ్ఞానికపరమైన అంశాలు ఈ వేడుకలో దాగి ఉన్నాయి. బొమ్మల పండుగ, ముగ్గుల పండుగ, పంటల పండుగ, పశువుల పండుగ, పెద్దల పండుగ, పెద్ద పండుగ? ఇలా సంక్రాంతికి ఎన్నో పేర్లు. వీటన్నిటికన్నా సంక్రాంతి అనగానే మనకు గుర్తుకు వచ్చేవి ప్రతి ఇంటి ముంగిటా మెరిసిపోయే ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసుల భజనలు, గంగిరెద్దుల ఆటలు, భోగిమంటలు, అరిసెలు, బొమ్మల కొలువు వంటివి ఆనందాన్ని ఇస్తాయి. సంక్రాంతి పుష్యమాసంలో వస్తుంది. వరుస ప్రకారం పుష్యమాసం సంవత్సరంలో పదో మాసం. ఈ నెలలో పూసగుచ్చడానికి కూడా పొద్దు ఉండదని నానుడి.చల్లచల్లని గాలులు మేనును స్పృశించడం, మంచుజల్లులు పుడమిని ముద్దాడటం. ఇవన్నీ పుష్య సోయగాలే. పుష్య అంటే పోషణ శక్తి కలదని అర్థం. పుష్య పూర్ణిమ నాటి రాత్రి సిద్ధాంతులు దూదిని మంచులో ముంచి ఆ మర్నాడు దాన్ని పిండి ఆ పక్రియలో వచ్చిన నీటి చినుకుల్ని బట్టి వర్ష నిర్ణయం చేసేవారని చెబుతారు. ఎన్ని చుక్కలు జారిపడితే అన్ని కుంచాల వాన కురుస్తుందని అంచనా వేసేవారు. ప్రాచీన కాలంలో ప్రకృతి పరిశీలన ద్వారా మనిషి సాధించిన వైజ్ఞానిక ప్రగతికి ఇది ప్రతీకగా కనిపిస్తుంది.అలాగే దేవుడికి కృతజ్ఞతతో పూజలు చేస్తారు. కళ్లాపి చల్లడం. ముగ్గులు వేయడం. గొబ్బిళ్ళు పెట్టడం, పతంగులు ఎగరవేయడం. భోగిమంటలు వేయడం ద్వారా ఈ పండగ రోజుల్లో ప్రకృతిని అరాధిస్తారు. అందుకే ప్రజలు ఒకరితో మరొకరు కృతజ్ఞతతో మెలగాలని వాటి చెప్పే పండుగ పరమార్థం.

# నదీస్నానం ఎంతో మంచిది

**విజయవాడ:** సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించినప్పుడు మకర సంక్రాంతి పండుగను జరుపుకుంటారు. ఈ రోజున గంగాతోపాటు ఇతర పవిత్ర నదులలో స్నానానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. కానీ అలా కుదరని పక్షంలో ఇంట్లోనే స్నానం చేసే నీటిలో గంగాజలం కలుపుకుని స్నానం చేయాలి ఇలా చేయడం వల్ల గంగాస్నానం చేసినంత ఫలితం ఉంటుంది. మత విశ్వాసాల ప్రకారం మకర సంక్రాంతి రోజున స్నానం చేయడం, దానం చేయడం వల్ల వారి సంపదకు హాని ఉండదు. ఇది కాకుండా మకర సంక్రాంతి రోజున ఉడకబెట్టిన పప్పు, బియ్యం దానం చేస్తారు. అంతేకాకుండా నువ్వులు, చిర్వా, ఉన్ని బట్టలు, దుప్పట్లు మొదలైన వాటిని దానం చేయడం కూడా మంచిది. వైదిక క్యాలెండర్ ప్రకారం మాఘ మాసంలోని రోజున ఆత్మకు కారకుడైన సూర్యభగవానుడు ధనుస్సు రాశి నుంచి బయటకు వెళ్లి మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. అందుకే జనవరి 14, 2025న మకర సంక్రాంతిని



జరుపుకుంటారు. ఈ రోజున ఉదయం 09.03 గంటల నుంచి సాయంత్రం 05.46 గంటల వరకు శుభముహూర్తం. ఈ కాలంలో స్నానం, ధ్యానం, పూజలు, జపం, తపస్సు, దాన ధర్మాలు చేయవచ్చు. అదే సమయంలో మహా పుణ్యకాలం ఉదయం 09.03 నుంచి 10.48 వరకు ఉంటుంది. ఈ కాలంలో పూజలు, దానం చేయడం వల్ల సూర్యభగవానుడి విశేష ఆశీస్సులు లభిస్తాయి. జ్యోతిష్యుల అభిప్రాయం ప్రకారం జనవరి 14న సూర్యభగవానుడు ధనుస్సు రాశిని వదిలి ఉదయం మకరరాశిలోకి ప్రవేశిస్తాడని తెలిపారు. సంక్రాంతి సూర్యభగవానుడి రాశి మారిన తేదీన జరుపుకుంటారు. అందుకే జనవరి 14న మకర సంక్రాంతిని జరుపుకుంటారు. మకర సంక్రాంతి రోజున సూర్యోదయానికి ముందే నిద్ర లేవాలి. ఈ సమయంలో సూర్య భగవానుడికి నమస్కరిస్తూ రోజును ప్రారంభించండి. మీ ఇంటిని శుభ్రం చేసుకోవాలి. అరోజువారీ పనులు పూర్తి చేసిన తర్వాత, సౌకర్యవంతంగా ఉంటే గంగా లేదా పవిత్ర నదిలో స్నానం చేయండి. సౌకర్యం లేకుంటే గంగాజలం ఉన్న నీటితో స్నానం చేయండి. పసుపు రంగు దుస్తులు ధరించండి. ఆ తరువాత సూర్య భగవానుడికి నీటిని సమర్పించి, నువ్వులను తీసుకుని ప్రవహించే నీటి ప్రవాహంలో తేలే విధంగా వేయండి. సరైన ఆచారాలతో సూర్య భగవానుడిని పూజించండి. పూజ సమయంలో సూర్య చాలీసా పఠించండి. చివరగా హారతి చేయడం ద్వారా పూజను ముగించండి. పూజ తర్వాత అన్నదానం చేయండి. మకర సంక్రాంతి రోజున పూర్వీకులకు నైవేద్యాలు, పిండదానం కూడా చేస్తారు.సంక్రాంతి మరుసటి రోజు కనుము. ఇది రైతులకు ఎంతో ముఖ్యమైన పర్వదినం. వ్యవసాయమే ఆధారమైన మన దేశంలో ఈ కనుము నాడు వ్యవసాయ పరికరాలను చక్కగా అలంకరించడం, పశు సంపదకు పూజలు చేయడం, ఎడ్లబండ్లను రంగురంగుల కాగితాలతో అలంకరించడం, పూజించడం కనబడుతుంది. ఈ పర్వదినం రోజు వ్యవసాయదారులందరూ తమ ఇళ్లల్లో చక్కగా పూజలు నిర్వహించుకొని, ఎడ్లబండ్లపై గ్రామవీధులలో ఊరేగుతారు. ప్రధానకూడళ్లలో ఎడ్లబండ్లను ప్రదర్శనగా ఉంచడం పరిపాటి.

# గొబ్బెమ్మలు..ఆటపాటలు...పిండివంటలు

## సంక్రాంతి సంబరాల్లో అన్నీ ప్రత్యకమే

**భీమవరం:** తెలుగు ప్రజలు జరుపుకొనే అతి పెద్ద పండుగ సంక్రాంతి.. ముఖ్యంగా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంత వాసులు ఈ పండుగను నాలుగు రోజుల పాటు చేసుకుంటారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన రోజునే మకర సంక్రాంతిగా జరుపుతారు. గొబ్బెమ్మలు, భోగి మంటలు, గంగిరెద్దులు, పిండి వంటలు, హరిదాసు కీర్తనలు, రథం ముగ్గులు, కోడి పందేలతో సంబరాలు చేసుకుంటారు. ఈ పండుగ తొలి రోజును 'భోగి'గా, రెండో రోజును 'మకర సంక్రాంతి'గా, మూడో రోజును 'కనుమ' పండగగా పిలుస్తారు. ఇక, నాలుగో రోజును 'ముక్కనుమ' అంటారు. కాగా, ఈ రోజు సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానాలు చేసిన తర్వాత ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేసుకొని పాతకికి స్వస్తి పలికి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ భోగి మంటలల్లో పాత పనికిరాని వస్తువులను, పీడలను వేసి, తమకు ఉన్న అరిష్టాలను తొలగించుకుంటారు. తెల్లవారక ముందే భోగి మంటలతో మొదలుకుని కుటుంబంలో ఆనంద కోలాహలం స్టార్ట్ అవుతుంది. మనలో ఉన్న బద్ధకాన్ని, అశ్రద్ధను, మనసులో ఉన్న చెడును ఈ భోగి మంటలలో వేసి నేటి నుంచి నూతన ఆనంద, ఆప్యాయతలతో ఉన్న జీవితాన్ని ప్రారంభిస్తున్నామని ఆత్మారామునికి ప్రజలు మాట ఇస్తారు. రేగి



పండ్లను బదరీఫలం అని కూడా పిలుస్తుంటారు. ఆ పరమ శివుడ్ని ప్రసన్నం చేసుకోవడానికి నారాయణులు బదరికావనంలో ఘోర తపస్సు చేసినప్పుడు.. ఆ సమయంలో దేవతలు వారి తలల మీద బదరీ ఫలాలని కురిపించడంతో.. ఆనాటి సంఘటనకు ప్రతీకగా పిల్లలను నారాయణుడిగా భావించి భోగిపండ్లను పోసే సంప్రదాయం వచ్చిందని చెప్తుంటారు. ఇక, భోగి ముగిశాక సూర్యుడు దక్షిణాయణం నుంచి ఉత్తరాయణంలోకి వస్తాడు. ఆ రోజే మకర రాశిలోకి ప్రవేశిస్తాడు.. సంక్రాంతి సూర్యుడి పండుగ.. కాబట్టి సూర్యుణ్ని పోలిన గుండ్రని రూపం, ఎర్రటి రంగుతో దీనికి అర్కఫలం అనే నామాకరణం వచ్చింది. సూర్య భగవానుడి ఆశీస్సులు పిల్లవాడికి లభించాలనే సూచనగా ఈ భోగిపండ్లను పిల్లలపై పోస్తుంటారు. కౌమ ర్యంలోకి అడుగు పెట్టడానికి ముందే అంటే.. దాదాపు 12 ఏళ్లలోపు చిన్నారుల తలపై ఈ భోగి పండ్లను పోయవచ్చు అన్నమాట. సూర్యుడు దక్షిణాయనంలో ఉండే చివరి రోజే భోగి పండగా. ఈ రోజు చలి తారస్థాయికి చేరుకుంటుంది. కాబట్టి, భోగిమంటలు వేసుకోమని సంప్రదాయం వచ్చింది. భోగినాటికి ఉధృతంగా ఉండే చలి వల్ల క్రిమికీటకాలు ప్రబలే ఛాన్స్ ఉంటుంది.. కనుక, భోగిమంటలు వాతావరణంలోకి వెచ్చదనాన్ని నింపడంతో.. సంక్రాంతి నాటికి పంట కోతలు పూర్తవడంతో పాటు పొలాల నుంచి పురుగూ పుట్రా కూడా ఇళ్ల వైపుగా వస్తుంటాయి. వీటిని తిప్పికొట్టేందుకు కూడా భోగి మంటలు ఎంతో ఉపయోగపడతాయి. ఇక, భోగి మంట వెనక మరో అంశం కూడా ఉంది. సంక్రాంతి రోజు నుంచి సూర్యుడు ఉత్తరాయణంలోకి అడుగుపెడతాడు. దీంతో ఎండ వేడిలో ఒక్కసారిగా చురుకుదనం స్టార్ట్ అవుతుంది. పరిసరాలలోని ఉష్ణోగ్రతలలో ఒక్కసారిగా వచ్చే ఈ మార్పుని తట్టుకునేందుకు శరీరం ఇబ్బందికి గురైతుంది. దీంతో జీర్ణ సంబంధమైన సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. భోగి మంటలతో రాబోయే మార్పుకి శరీరాన్ని రెడీ చేసినట్లవుతుంది. ఇక్కడ మనం ఒక విషయం గమనించాలి.. భోగి మంటలు కేవలం చలి మంటలే కాదు.. అగ్ని దేవుడిని ఆరాధించుకునే ఒక సందర్భం కూడా.. కాబట్టి భోగిమంటలు వేసుకునేందుకు పెద్దలు కొన్ని సూచనలు చేశారు. హోమాన్ని ఎంత పవిత్రంగా రాజేస్తామో భోగి మంటను కూడా అంతే పవిత్రంగా ప్రారంభి ంచాలట. ఇందుకోసం సూర్యాదయానికి ముందే నిద్రలేచి స్నానం చేసి.. శుచిగా ఉన్న వ్యక్తి చేతనే భోగి మంటని వెలిగింప చేయాలి.. అది కూడా కర్పూరంతో వెలిగిస్తే చాలా మంచిదని చెబుతారు.

# సందడిగా కైట్ ఫెస్టివల్

## చిన్న పెద్ద తేడా లేకుండా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు



**హైదరాబాద్:** సంక్రాంతి పండుగ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది ముగ్గులు.. ఆ తరువాత పతంగులు. సంక్రాంతి సందర్భంగా యువత ఎంతో ఉత్సాహంగా కైట్స్ ఎగురవేస్తుంటారు. మహిళలు ఇంటి ముందు పెద్ద పెద్ద ముగ్గులతో పండుగను జరుపుకోగా.. మగవారు పతంగులు ఎగురవేస్తూ ఆడి పాడి ఎంజాయ్ చేస్తుంటారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తుంటారు. అలాగే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పలు చోట్ల కైట్స్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడకు చేరుకుని పతంగులు ఎగురవేస్తారు. ఒకరితో ఒకరు పోటీ పడి మరీ గాలిపటాలను ఎగురవేస్తారు. వివిధ రకాల పతంగులు ప్రస్తుతం మార్కెట్లలో లభిస్తున్నాయి. ఇక చిన్న పిల్లల జోష్ మామూలుగా ఉండదు. ఇంట్లోని తమ తండ్రి, అన్నలతో కలిసి పిల్లలు కైట్స్‌ను ఎగురవేస్తూ ఆనందిస్తుండగా.. యువత తమ స్నేహితులతో కలిసి పతంగులు ఎగురవేస్తారు. అలాగే కైట్స్ ఫెస్టివల్‌ను డీజే మోతతో హోరెత్తిస్తుంటారు. మరోవైపు హైదరాబాద్‌లో పతంగుల సందడి మొదలైంది. సిటీలోని పలు ప్రాంతాల్లో కైట్స్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. డీజే హోరు మధ్య భవనాలపై పతంగులు ఎగురుస్తున్నారు యువత. పోటాపోటీగా పతంగులు ఎగరేస్తూ యువత సందడి చేస్తోంది. బోయినపల్లిలో ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్‌లో చిన్నారులతో కలిసి మాజీ మంత్రి మల్లారెడ్డి పతంగులు ఎగిరవేశారు. మరోవైపు హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు 7వ అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ జరుగనుంది. అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈరోజు సాయంత్రం 4 గంటలకు నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్ ప్రారంభమవగా.. దాదాపు 19 దేశాల నుంచి 47 మంది ఇంటర్నేషనల్ ప్రొఫెషనల్ కైట్ ఫ్లైయర్స్ ఫెస్టివల్‌లో పాల్గొనున్నారు. అలాగే14 రాష్ట్రాల నుంచి కైట్ ఫెస్టివల్‌లో 54 మంది నేషనల్ ప్రొఫెషనల్ కైట్ ఫ్లైయర్స్ పాల్గొంటారు. పతంగుల పండుగకు ఇండోనేషియా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, కెనడా, కంబోడియా, స్కాట్లాండ్, థాయిలాండ్, కొరియా, ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేషియా, ఇటలీ, తైవాన్, సౌత్ ఆఫ్రికా, నెదర్లాండ్స్, తదితర దేశాలకు చెందిన 50 మంది కైట్ ఫ్లైయర్స్ హాజరుకానున్నారు. అలాగే గుజరాత్, పంజాబ్, తమిళనాడు, కేరళ, హరియాణా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన 60 మంది క్రీడాకారులు తరలిరానున్నారు. ఈ మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కైట్ ఫెస్టివల్ జరుగనుంది.

## భగవంతుడికి కృతజ్ఞతగా ఉండాలి

**తిరుమల:** సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన రోజే సంక్రాంతి. దేవుడికి ఎన్నో సార్లు మొక్కాం కానీ మా మొర ఆలకించడం లేదని అంటుంటారు కొందరు. భక్తితో మొక్కకేస్పొయినా, వాళ్లను మాత్రం లక్షణంగా చూస్తున్నాడని ఆరోపిస్తుంటారు ఇంకొందరు. రోజు గుడికి వెళ్లే వాళ్లు, ఇంట్లో పూజలు చేసి. భగవంతుడిని కొలిచే వాళ్లను పట్టించుకోవడం లేదని వాపోతుంటారు మరి కొందరు. ఆ దేవుడికి మా మీద ఇంకా యకలగలేదని మరికొందరు బాధపడుతూ ఉంటారు. నిజానికి పూజలు, వ్రతాలు, ప్రార్థన... దేవుడి మీద, సమ్మకంతో చేసేవి. మరి భగవంతుడు కరుణించాలంటే... మంచి ప్రవర్తన కలిగి ఉండాలి. కృతజ్ఞతతో మెలగాలి. దేవుడికి పూజలు చేసేటప్పుడు కోర్కెలు తీర్చమని అడిగేటప్పుడు మనసులో ఎలాంటి దురుద్దేశ్యం ఉండకూడదు. అలాగే అవి ఇతరులకు కీడు చేసేవి కాకూడదు. సుఖాలు, సంతోషాలు కావాలని దేవుడిని అడగడం కంటే నీతి నిజాయితీతో ప్రవర్తిస్తామని.. దేవుడికి మాట ఇవ్వడం ముఖ్యం. భక్తులు దేవుడిపట్ల కృతజ్ఞతతో వ్యవహరిస్తారు. అందుకోసమే పూజలు ప్రార్థరలు, వ్రతాలు చేస్తారు. అలా కాకుండా ఐశ్వర్యం, ఉద్యోగం, పదవి లాంటివి ఇవ్వాలని అడగకూడదు. తెలివి తేటలు, ప్రతిభతో మనిషి వాటిని సాధించుకోవాలి. 'దేవుడా నీవే నాకు దిక్కు, నేనేం చేయను, నీవే నాకు అన్ని చేసిపెట్టాలని మొక్కుకుంటే ఫలితం ఉండదని పురాణాలే చెప్తున్నాయి. ప్రతి ఒక్కరూ తప్పక ప్రయత్నం చేయాలని సూచించాయి. గుడికి వెళ్లినప్పుడు దేవుడిని పూజిస్తూ, లోపలున్న చెడు స్వభావాన్ని తొలగించుకోవాలని పురాణాలు చెప్తున్నాయి. దేవుడు గుడి మాత్రమే కాదు ప్రకృతిలోని ప్రతి ఒక్కటి పూజనీయమే. సాటి మనుష్యులు, చెట్లు, పుట్టలు, ఆకులు,నదులు.. అన్నీ.అందుకే. నదులు, చెట్లను పూజించే సంప్రదాయం వచ్చింది. అంటే మనిషి జీవించడానికి యోగపడే ప్రతిదానికీ కృతజ్ఞత తెలపాలి. పూజించడం. ప్రార్థన చేయడం కూడా అలాంటివే.

## మకర సంక్రాంతితో ఉత్తరాయణం ప్రారంభం

### పుణ్యాకార్యాలకు ఆరోజు మంచిదని నమ్మకం

**తిరుమల:** హిందువుల పండుగలలో ముఖ్యమైనది..తెలుగువారికి అతి పెద్ద పండుగ మకర సంక్రాంతి. ఈ రోజు సూర్యుడు తన దిశను దక్షిణం వైపు నుంచి ఉత్తరం వైపు మార్చుకుంటాడు. ఉత్తరాయణం మొదలయ్యే ఈ సమయం దేవతలకు రాత్రి పూర్తై సూర్యోదయం అయ్యే సమయం. దేవతలు నిద్రలేచే ఈ సమయాన్నే ఉత్తరాయణ పుణ్యకాలం అంటారు. ఇంత విశేషమైన రోజు చేసే స్నానం, దానం అనంత ఫలితాన్ని అందిస్తాయి. ఈయేడు మకర సంక్రాంతి జనవరి 14 మంగళవారం వచ్చింది. ఈ రోజు స్నానం, దానం చేసేందుకు పుణ్యకాలంగా భావిస్తారు. జనవరి 14 మంగళవారం మకర సంక్రాంతి - ఉత్తరాయణం ప్రారంభం కానుంది. పాడ్యమి తిథి - మంగళవారం రాత్రి 3.28 నిముషాలవరకూ ఉంది..అంటే తెల్లవారితే బుధవారం శ్రీరామచంద్రుడి నక్షత్రం అయిన పునర్వసు ఉదయం 10.52 వరకు ఉంది. మృత ఘడియలు ఉదయం 8.28 నుంచి 10.03 వరకు ఉన్నాయి తిరిగి రాత్రి తెల్లవారుజామున 4.43 నుంచి 6.20వరకు ఉంటాయి. దుర్ముహూర్తం ఉదయం 8.51 నుంచి 9.35 వరకు తిరిగి రాత్రి 10.49 నుంచి 11.41 వరకు ఉంటుంది. సూర్యోదయం ఉదయం 6.38 ,సూర్యాస్తమయం సాయంత్రం 5.40 సూర్యోదయానికి ముందే స్నానమాచరించి..సూర్యభగవానుడికి అర్ఘ్యం విడిచిపెడతారు. వర్జ్యం, దుర్ముహూర్తం లేని సమయంలో పెద్దలకు తర్పణాలిస్తారు. పెద్దలను పూజిస్తారు. మకర సంక్రాంతి రోజు పెద్దలను పూజించాల్సిన పుణ్యకాలం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు ఉంటుందని చెబుతున్నారు. దేశవ్యాప్తంగా మకర సంక్రాంతిని విశేషంగా జరుపుకుంటారు. వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో , విభిన్న సంప్రదాయాలను అనుసరించి పండుగ చేసుకుంటారు. ఈ రోజు పిండివంటలు ఇరుగు పొరుగు పంచుకుంటారు. శక్తికొలది దానాలు చేస్తారు. చలికాలం కావడంతో దుప్పట్లు, దుస్తులు దానం చేస్తారు. వీటితో పాటూ పిండి వంటలు, నువ్వులు, లడ్డూలు పంచిపెడతారు. ఏడాది మకర సంక్రాంతికి ఓ రోజు ముందు భోగి నుంచి కుంభమేళా ప్రారంభమవుతోంది. సంక్రాంతి పర్వదినం, కుంభమేళా సందర్భంగా ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమంలో స్నానమాచరించేందుకు భక్తులు పోటీపడతారు. సాధారణంగా సంక్రాంతి రోజు నదీస్నానం ఉత్తమం.. అత్యంత పవిత్రంగా భావించే కుంభమేళా జరిగే ప్రదేశాల్లో నదీస్నానం ఆచరించడం మరింత పుణ్యఫలం అని పండితులు చెబుతున్నారు. మకర సంక్రాంతి రోజు సూర్య భగవానుడు తన దిశను మార్చునే సమయంలో శని దేవుడి గృహంలో సంచరిస్తాడని చెబుతారు. సూర్యుడి తనయుడు శని. మకర సంక్రాంతి రోజు శనిని పూజించడం ద్వారా గ్రహదోషాలు తొలగిపోతాయని..అందుకే ఈ రోజు నదీ స్నానం ఆచరించిన తర్వాత సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వడంతో పాటూ శని భగవానుడిని స్మరించాలని చెబుతారు. నువ్వులు దానం చేయడం, నువ్వులతో చేసిన పిండివంటలు పంచిపెట్టడం ఈ కోవకే చెందుతుంది.

# ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డిపై మూడు కేసులు నమోదు



**కరీంనగర్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పండుగపూట బిగ్ షాక్ తగిలింది. ఆయనపై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. కరీంనగర్ వన్ టౌన్ పీఎస్‌లో ఈ కేసులు నమోదు అయ్యాయి. కరీంనగర్ ఆర్డీవో, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పీఏల ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ యాక్టు 132, 115 (2), 352,292 కింద కేసులు నమోదు అయ్యాయి. మరో ఫిర్యాదు ఆధారంగా 126 (2),115(2) పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సంజయ్ కొట్టుకున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా సమీక్షా సమావేశంలో ప్రభుత్వ పథకాలపై చర్చ జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సహా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మైక్ తీసుకుని మాట్లాడే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన కౌశిక్ రెడ్డి నువ్వు ఏ పార్టీ అంటూ సంజయ్‌ను ప్రశ్నించారు. దమ్ముంటే కాంగ్రెస్ టికెట్‌పై గెలవాలని సవాల్ చేశారు. దీంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. వాగ్వాదం కాస్తా ముదిరి ఇద్దరూ ఒకరిపై మరొకరు చేయి చేసుకున్నారు. మంత్రుల ఎదుటే కొట్టుకున్నారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు కౌశిక్ రెడ్డిని కలెక్టరేట్ నుంచి బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. వివాదం నేపథ్యంలో అక్కడంతా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. కాగా, బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మాట్లాడడం ఏంటని కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. మరోవైపు కౌశిక్ రెడ్డి ఎక్కడుంటే అక్కడ వివాదాలు ఉంటాయని కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అమ్ముడుపోయారని పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. సంజయ్‌ను నువ్వు ఏ పార్టీ అని అడిగితే కాంగ్రెస్ పార్టీ అని చెబుతున్నారన్నారు. అలా అయితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ టికెట్‌పై గెలిచి చూపించాలని కౌశిక్ రెడ్డి సవాల్ చేశారు. కేసీఆర్ పెట్టిన భిక్ష వల్ల నువ్వు ఎమ్మెల్యేగా గెలిచావని.. అలాంటిది ఆయనపైనే విమర్శలు చేస్తున్నావు, నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నావన్నారు. తాము కచ్చితంగా నిలదీస్తామని.. అడుగడుగునా అడ్డుకుంటామని తెలిపారు. కాగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరుపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని మంత్రి ఉత్తమ్ తీవ్రంగా ఖండించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ను అడ్డుకుని దాడి చేయడంపై కరెక్ట్ కాదంటూ మండిపడ్డారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. పేదవానికి మేలు జరిగే కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తన ఏ మాత్రం బాగోలేదని మండిపడ్డారు. పోలీసులు అదుపు చేసిన ఆగకపోవడం దారుణమని అన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అధికార లాంఛనాలతో మంద జగన్నాథం అంత్యక్రియలు



**హైదరాబాద్:** నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్ కలెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జగన్నాథం అంత్యక్రియలకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మందా జగన్నాథం.. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా మధుమేహం, రక్తపోటు, గుండె, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్నారు. గత నెల 22న ఊపిరితిత్తుల సమస్య రావడంతో కుటుంబసభ్యులు నిమ్స్‌లో చేర్చారు. రోజురోజుకూ పరిస్థితి విషమించడంతో ఆయనను ఆర్ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా గుండెపోటు రాగా, వెంటనే అత్యవసర వైద్య చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. రాత్రి 7.40గంటలకు మృతిచెందినట్టు నిమ్స్ వైద్యులు బులెటిన్ విడుదల చేశారు. మందా జగన్నాథం భౌతికకాయాన్ని నిమ్స్ నుంచి హైదరాబాద్‌లోని చంపాపేట్‌కు తరలించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సంతోష్‌నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు తెలిపారు జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం, ప్రస్తుత ఎర్రవల్లి మండలం కొండేరు గ్రామంలో పెద్దపుల్లయ్య- మంద సవారమ్మ దంపతులకు 1951 మే 22వ తేదీన మందా జగన్నాథం జన్మించారు. ఆయన తండ్రి నాగార్జునసాగర్‌లోని పైలాన్ కాలనీలో మెకానికల్ విభాగంలో వాచ్‌మెన్‌గా, తల్లి సవారమ్మ హిల్‌కాలనీలో ఆఫీస్ అటెండెంట్‌గా పని చేశారు. విద్యాభ్యాసం అనంతరం వైద్య వృత్తిలో కొనసాగారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ నుంచి పోటీచేసి నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కూడా కొనసాగారు. తర్వాత కొంతకాలానికి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1996, 1999, 2004, 2009 ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. 2014 మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ అడుగు జాడల్లో నడిచారు.

# భారత్‌లో పెరుగుతున్న హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు



**న్యూఢిల్లీ:** భారత్‌లో హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా మరోచిన్నారి ఈ వైరస్ బారిన పడింది. పుదుచ్చేరికి చెందిన చిన్నారికి హెచ్ఎమ్‌పీవీ వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఆరోగ్య శాఖ అధికారి రవిచంద్రన్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు చిన్నారి జ్వరం, దగ్గు, జలుబుతో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం చిన్నారి వైద్య చికిత్సకు సహకరిస్తోందని చెప్పారు. కాగా, తాజా కేసుతో పుదుచ్చేరిలో హెచ్ఎమ్‌పీవీ కేసులు రెండుకు చేరాయి. గతవారం మూడేండ్ల చిన్నారి ఈ వైరస్ బారిన పడిన విషయం తెలిసిందే. చికిత్స తర్వాత పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యింది. తాజా కేసుతో కలిపి భారత్‌లో హెచ్ఎమ్‌పీవీ కేసులు 18కి చేరాయి.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఇచ్చిమొచ్చినట్లు క్రియేట్

### ప్రముఖుల ఫొటోలను మార్ఫింగ్

### తాజాగా జాన్వీకపూర్, హర్దిక్‌పాండ్యా క్లోజ్‌గా ఉన్నట్లు వైరల్

**న్యూఢిల్లీ:** ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సాయంతో కొందరు ఇచ్చిమొచ్చినట్లుగా ప్రముఖుల ఫొటోలను మార్ఫింగ్ చేసి నెట్టింట్లో పోస్టు చేస్తున్నారు. దీంతో దానిని చూసిన నెటిజన్లు అది నిజమోనని ఆరా తీయడం మొదలు పెడుతున్నారు. ఇది ఈ మధ్యకాలంలో బాగా పెరిగింది. ఇందుకు ప్రధాన కారణంగా ఎఐ ఆర్టిఫిషియల్ ఇంకా మరింత అభివృద్ధి చెందటమే కారణంగా.ఈ నేపథ్యంలో క్రికెటర్ హార్దిక్ పాండ్యా, స్టార్ నటి జాన్వీ కపూర్ డేటింగ్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో తెగ ప్రచారం జరుగుతోంది. అందుకు కారణం ఇద్దరూ చనువుగా ఉన్న ఫొటోలు వైరల్ కావడమే. వీరిద్దరూ కలిసి ఇటీవలే మాల్దీవుల్లో విహరించినట్లు ఆ ఫొటోలను బట్టి తెలుస్తోంది. జాన్వీ-పాండ్యా సముద్ర తీరంలో విహరిస్తూ, సన్నిహితంగా కనిపించారు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు హార్దిక్ జాన్వీ పీకల్లోతు ప్రేమలో ఉన్నారంటూ మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. దీంతో రంగంలోకి దిగిన నేషనల్ మీడియా ఫ్యాక్ట్ చెక్ నిర్వహించగా అసలు విషయం బయటపడింది. ఈ ఫొటోలు నిజం కాదని తేల్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో క్రియేట్ చేసినవిగా తేల్చింది. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ వచ్చిన వార్తలు కేవలం పుకార్లు మాత్రమే అని స్పష్టమైంది. కాగా, హార్దిక్ పాండ్యా ఇటీవలే తన భార్య నటాషా స్టాంకోవిక్‌తో విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం తన దృష్టిమొత్తం కెరీర్‌పైనే పెట్టాడు. ఇక జాన్వీ కపూర్ వరుస బాలీవుడ్ ప్రాజెక్టులతోపాటు టాలీవుడ్ సినిమాలతో బిజీగా మారిపోయింది.

## జాడ్యాలను వదులుకోవాలి

### సంక్రాంతి ఉత్తేజానికి ప్రతీక

**శ్రీశైలం:** పల్లె, పట్నం తేడా లేకుండా ప్రజలందరూ మూడు రోజుల పాటు ఉత్సాహంగా జరుపుకొనే పండుగ సంక్రాంతి. ప్రతి లోగిలి ఇప్పటికే రంగుల క్రాంతిని సంతరించుకోగా.. భోగి పండుగతో అసలు పర్వదినం ప్రారంభం కానుంది. సూర్యుడు దక్షిణాయంలో ఉండే చివరి రోజుగా భోగిని చెప్పుకొంటారు. ఈ ఏడాది భోగికి మరో విశిష్టత సైతం ఉంది. సోమవారం, పుష్య మాసం, పౌర్ణమి, ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో ఈ రోజుని శివ ముక్కోటిగా పండితులు చెప్పుకొంటున్నారు. 110 ఏళ్లకోసారి ఈ అద్భుత కలయిక వస్తుందంటున్నారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ భోగి నాడు ఆవు పేడతో చేసిన పిడకలు, నెయ్యితో పాటు ఇంట్లోని పాత కలప వస్తువులతో వేసే భోగి మంటల్లో మనలోని దుర్గుణాలు సైతం వేసి ఈ సంక్రాంతి నుంచి మనలో ప్రగతి క్రాంతి వెల్లివిరియాలని కోరుకుందాం.ప్రస్తుతం యువతను పెడదోవ పట్టిస్తున్న జాఢ్యాల్లో మద్యం, ధూమపానం, మత్తు పదార్థాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఈ ఏడాది భోగి మంటల్లో మనలోని చెడు వ్యసనాలన్నీ వేసి దహనం చేయాలి. గత ఏడాది ఉమ్మడి జిల్లాలో అక్రమ మద్యం, గంజాయి పట్టుకున్న ఘటనలు సుమారు 500 పైగా చోటు చేసుకున్నాయి. జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం ఏ విధంగా ఉందో తెలుసుకునేందుకు ఈ గణాంకాలే నిదర్శనం. ఇటువంటి వాటిని ఈ ఏడాది నుంచే దూరం చేసుకుందాం. ప్రస్తుతం సమాజంలో ప్రజలను పట్టి పీడిస్తున్న మరో జాఢ్యం సెల్‌ఫోన్. ప్రజలందరూ రోజులో ఎక్కువ సమయం దీనికే అతుక్కుపోతున్నారు. గడుపుతూ..కుటుంబం, పిల్లలు, భవిష్యత్తును దూరం చేసుకుంటున్నారు. దీన్ని వినియోగించే సమయాన్ని చాలా వరకు తగ్గించాల్సిన అవసరం ఉంది. ఇకపోతే పర్యావరణానికి హాని తలపెడుతున్నప్లాస్టిక్ భూతం వేగంగా విస్తరిస్తుంది. ఇలా నిత్యం టన్ను పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు మన వంతు కర్తవ్యాన్ని నిర్వహిద్దాం. మరో వైపు అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, రహదారుల విస్తరణ పేరుతో నరికేస్తున్న చెట్ల స్థానంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు ఈ సంక్రాంతి నుంచే శ్రీకారం చుడదాం.ఉమ్మడి జిల్లాలో సుమారు 50శాతం మంది కాలు కదపకుండా బద్ధకానికి బద్దులైపోయారు. దీంతో అనేక మంది రక్తపోటు, మధుమేహం, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రజలు తమ బద్ధకాన్ని విడిచిపెట్టి.. నిత్యం ఉదయాన్నే నడక, వ్యాయామం చేస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు జీవితాన్ని ఉత్సాహంగా గడపాలని ఆశిద్దాం.

## మహా కుంభమేళా వద్ద ములాయం సింగ్‌యాదవ్ విగ్రహం

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద మహా కుంభమేళా సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఈ కుంభమేళాలో యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు ములాయం సింగ్ యాదవ్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ విగ్రహాన్ని ప్రతిష్టించడంతో సమాజ్‌వాదీ పార్టీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటుంది. ములాయం విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో సాధువులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ములాయం సింగ్ యాదవ్ స్మృతి సేవా సంస్థాన్ సెక్టార్ 16లోని శిబిరంలో ఏర్పాటు చేశారు. రెండు నుంచి మూడు అడుగుల ఎత్తులో ఉన్న ములాయం విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించినట్లు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు మాతా ప్రసాద్ పాండే ఆదివారం తెలిపారు. అయితే ములాయం విగ్రహ ఏర్పాటును అఖిల భారతీయ అఖార పరిషత్ తీవ్రంగా విమర్శించారు. పరిషత్ అధ్యక్షుడు మహంత్ రవీంద్ర పూరి మాట్లాడుతూ.. ములాయం సింగ్ యాదవ్ హిందూ వ్యతిరేకి అని మండిపడ్డారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఆయన పని చేశారని విమర్శలు గుప్పించారు. ములాయం విగ్రహం ఏర్పాటుకు మేం వ్యతిరేకం కాదు.. ఆయన యూపీకి సీఎంగా పని చేశారు. కానీ మహా కుంభమేళాలో ములాయం విగ్రహాన్ని ప్రతిష్టించడం సరికాదు. ఈ విగ్రహ ఏర్పాటుతో యూపీలో ఆయన చేసిన అరాచకాలు, అల్లర్లు, మతవిద్వేషాలు గుర్తుకు వచ్చేలా ఉందన్నారు. ఈ దేశ ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు ఎస్పీ నేతలు. రామమందిర ఉద్యమంలో ఆయన సహకారం ఏమిటో అందరికీ తెలుసు. ఆయన ఎప్పుడూ హిందూ వ్యతిరేకి, సనాతన ధర్మానికి వ్యతిరేకి, ముస్లింలకు అనుకూలంగా ఉండేవారు అని రవీంద్ర పూరి పేర్కొన్నారు.

## యూపీకి కాసులు కురిపించనున్న కుంభమేళా

ఉత్తరప్రదేశ్‌లో మహా కుంభమేళా ప్రారంభమైంది. తొలి రోజు ఉదయం గంగా , యమునా, సరస్వతి నదులు కలిసిన త్రివేణి సంగమం వద్ద దాదాపు 50 లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు చేశారు. ప్రపంచంలోనే అత్యధిక మంది సమ్మేళనమైన కార్యక్రమంగా ఈ మహా కుంభమేళా రికార్డుల్లోకి ఎక్కనుంది. ఈ కుంభమేళాకు దాదాపుగా 45 కోట్ల మందికిపైగా భక్తులు తరలివస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.